ఆక్రమణలో ఆర్‌అండ్‌బీ రహదారులు

- తరచుగా రోడ్డు ప్రమాదాలు
- ప్రశ్నించిన వారిపై ఎదురుదాడి
- పట్టించుకోని అధికారులు



చర్ల బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలు



చర్లలోని గాంధీ సెంటర్‌లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలు

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రహదార్లు అక్రమణలకు గురయ్యాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రహదార్లను కొందరు షాపుల యజమానులు రహదార్లను మూసివేసి దుకాణాలను నిర్మించుకున్నారు. ఈ ప్రాంతాల్లో దారులు కుచించుకుపోయి తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు.

మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, పశువైద్యశాల సెంటర్, గాంధీ సెంటర్లతో పాటు మండలంలోని రాళ్లగూడెం, మామిడిగూడెం, దేవరాపల్లి, కుదురూరు, ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం, కలివేరు, తేగడ, గుంపెన్నగూడెం, రైస్‌పేట, కొయ్యూరు, సుబ్బంపేట తదితర గ్రామాల్లోని ఆర్‌అండ్‌బీ రహదార్లకు ఇరువైపులా ఆక్రమణలు చేపట్టిన వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ దారుల్లో నిత్యం పెద్ద సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు తిరుగుతుండగా.. ఆక్రమణ ప్రాంతాల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దుకాణాలు ఆక్రమించిన చోట్ల రోడ్లు ఇరుకుగా మారడం, అక్కడే పెద్ద వాహనాలు ఇతర వాహనాలను తప్పించే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు, ఈ ప్రధాన సెంటర్లలో కనీసం ఆర్టీసీ బస్సులను కూడా రోడ్డు పక్కకు దించి నిలిపేందుకు కూడా అవకాశం లేకపోవడంతో అక్కడే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీనిపై వ్యాపారులను వాహనదారులు ప్రశ్నిస్తే.. మేమే రోడ్డుపై షాపు పెట్టామా ? ఇంకెవ్వరూ పెట్టలేదా? అంటూ వాదనలు దిగుతున్నట్లు తెలుస్తోంది.

బెల్టుషాపులూ అక్కడే..

ఆర్‌అండ్‌బీ రహదార్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వాటిల్లో పలు చోట్ల బెల్టు షాపులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వాటిల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు వారి ద్విచక్రవాహనాలను రోడ్లపైనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమౌతోంది. దీంతోపాటు మందుబాబులు చిత్తుగా మద్యం సేవించి రోడ్లపై చిందులేస్తూ వచ్చి పోయే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఆర్‌అండ్‌బీ శాఖా అధికారులకు విన్నవించినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి..



రోడ్ల పక్కనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో వచ్చిపోయే వారితో పాటు వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డు పక్కన కనీసం పట్టుమని 10 అడుగులు ఖాళీ స్థలం లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సీహెచ్ రవికుమార్, రాళ్లగూడెం

దుకాణాలు తొలగించాలి



రోడ్ల పక్కన ఏర్పాటు చేయబడ్డ దుకాణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే వాటిని తొలగించాలి. ఆర్ అండ్‌బీ రోడ్ల నుంచి ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లే లింకు రోడ్ల జంక్షన్లలో ఉన్న ఆక్రమణల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మూల మలుపుల వద్ద చేపట్టిన ఆక్రమణల వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు కూడా కలిపించక పావడంతో వాహనాలు ఒకదానికొకటి ఢీకొంటున్నాయి.

– టి.నర్సింహారావు, చర్ల

క్లుప్తంగా

అటవీ మార్గాల్లో తనిఖీ



తాలిపేరు ప్రాజెక్టు సమీపంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చర్ల: మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల్లో సోమవారం చర్ల పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చర్ల సీఐ ఏ.రాజు వర్మ నేతృత్వంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తెలంగాణా రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోకి వెళ్లే ప్రధాన రహదార్లలో తనిఖీలను చేపట్టారు. ఆయా మార్గల గుండా రాకపోకలు సాగిస్తున్న ప్రతీ వాహనాన్ని ఆపి నిశితంగా పరిశీలించారు. మావోయిస్టులకు సరుకులు తరలించే అవకాశాలు ఉండడంతో ఈ తనిఖీలను చేపట్టినట్లు తెలుస్తోంది.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని తిరుమలకుంట గ్రామంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..ఆయిల్‌పాం, మామిడి తోటల యాజమాన్యంలో రైతులు సరైన పద్ధతులు, మెళకువలు పాటించాలని అన్నారు. అలాగే విత్తనాలను లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద నుంచే రైతులు కొనుగోలు చేసుకోవాలని, వాటి రసీదులను పంట కాలం చివరి వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. ఏఓ శివరామప్రసాద్, ఏఈఓలు నార్లపాటి రవీంద్ర, ఆరేపల్లి సతీష్, రైతులు పాల్గొన్నారు.

పథకాల అమలులో విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాల అమలులో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని పండువారిగూడెం గ్రామంలో జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీల్లో మహిళలకు ఫ్రీ బస్సు పథకం తప్ప మిగిలిన ఐదు హామీలు అమలు కావడం లేదన్నారు. రైతులకు బ్యాంక్ రుణాలు రద్దు కాగా, కొత్త రుణాలు రాక నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. ప్రధాన మంత్రి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని, మతం వైషమ్యాలను ప్రేరేపించి రాజ్యాంగ స్ఫూర్తికి, లైకిక తత్వానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అన్నవరపు కనకయ్య, చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరు, ముళ్లగిరి గంగరాజు, మడకం గోవింద్, కారం సూరిబాబు పాల్గొన్నారు.

ఆదివాసీల నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో పాల్గొన్న రామన్నగూడెం గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని రామన్నగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 30, 36, 39లో ఉన్న భూములను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజనులు సోమవారం అశ్వారావుపేటలోని తహసీల్దార్, ఫారెస్ట్ రేంజ్ కార్యాలయల ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్, హైకోర్టు ఆదేశాల ప్రకారం జాయింట్ సర్వే చేసి ఫారెస్టు, ఎఫ్‌డీసీ ఆధీనంలో ఉన్న 573 ఎకరాలను తక్షణమే హక్కు పత్రాలు ఉన్న గిరిజనులకు అప్పగించాలని కోరారు. ఈ భూముల సమస్యను పరిష్కరించే దాకా పోరాటాలు సాగిస్తామని తెలిపారు. కాగా, నిరాహార దీక్ష శిబిరాలను స్థానిక సీపీఎం నాయకులు అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కొక్కెరపాటి పుల్లయ్య, నాయకులు సందర్శించి పూర్తి మద్దతు ప్రకటించారు.

ప్రజాభీష్టం మేరకే అభివృద్ధి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: పుర ప్రజాభీష్టం, నిబంధనల ప్రకారమే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతాయని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం స్థానిక శ్రీసత్యసాయి కళ్యాణ మండపంలో జరిగిన 'మన మున్సిపాలిటీ–మన అభివృద్ధి' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా మున్సిపాలిటీ కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో వార్డులు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలను స్వీకరించారు. కాగా, కొత్తగా ఏర్పాటైన 22 వార్డుల్లో 5వ వార్డు నుంచి 22వ వార్డు వరకు విభజన అడ్డగోలుగా చేశారని, వాటిని పూర్తి స్థాయిలో పునఃవిభజన చేయాలని స్థానికులు కోరారు. దీంతో కమిషనర్ అభ్యంతరాలను లిఖిత పూర్వకరంగా మరో రెండు రోజుల్లో సమర్పిస్తే, వాటిని పరిశీలించి మార్పులు, చేర్పులు చేస్తామన్నారు.

అనంతరం స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొద్ది రోజుల క్రితమే అశ్వారావుపేట మున్సిపాలిటీకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15కోట్ల నిధులు మంజూరు చేసినట్లు, ఈ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని దొంతికుంట చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తామని, అటవీ శాఖ ఆధ్వర్యంలో రెండు ఎకరాల్లో ఏకో పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మరోమారు రూ.5కోట్ల వ్యయంతో ప్రతిపాదన చేశామని, త్వరలోనే టెండర్ పిలుస్తారని వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మున్సిపాలిటీ అధికారి శ్రీనివాసరావు, సీఐ నాగరాజు రెడ్డి, కాంగ్రెస్ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి..

దమ్మపేట: మండలంలోని లింగాలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మహిళ సభ్యురాలు ఊకే చిట్టెమ్మ, అనారోగ్య కారణంగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, లింగాలపల్లిలో మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడకం రాజేష్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, నాగబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

దమ్మపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మహిళ నాయకురాలు తొడెం దుర్గమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గమ్మ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకానికి అధికంగా నిధులు కేటాయించి, రోజువారి కూలిని రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకా రమేష్, వాడే గిరి, సోయం రవి, శ్రీను, సరస్వతి, కాకా మహలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే ఉజ్వల భవిష్యత్తు



ములకలపల్లి: మొగరాలగుప్ప గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, బడి ఈడు పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని భట్టుపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం మోహన్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం 'బడి బాట' కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి, తల్లిదండ్రులతో మాట్లాడి వారికి విద్య ప్రాముఖ్యతను, ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యా వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీజ,పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల్లో అందిస్తున్న వసతులను వివరిస్తున్నారు. తమ పాఠశాల్లోనే విద్యార్థులను చేర్పించాల్సిందిగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మొగరాలగుప్పలో హెచ్ఎం కొటం స్వరూప ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రచారానికి వచ్చిన ప్రైవేటు స్కూల్ వాహనాన్ని గ్రామస్తుల సహకారంతో అడ్డుకుని, వెనుక్కు పంపించారు. తిమ్మంపేటలో హెచ్ఎం శంకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఉపరితలంలో ఏర్పడిన ఖాళీల భర్తీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఏరియాకు చెందిన సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ ఖాళీలను ఏరియాలోని కొండాపురం భూగర్భగని కార్మికులతోనే భర్తీ చేసే విధంగా యాజమాన్యం చొరవ చూపాలన్నారు. పాత పద్ధతిలో జనరల్ అసిస్టెంట్ ఉపరితల భర్తీలు కొనసాగాలని లేదంటే ఏరియా కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్, మస్తాన్, దేశెట్టి రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఫీవర్ సర్వే

మణుగూరుటౌన్: చినరాయిగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. కాల్వల్లో లార్వాలను నిర్వీర్యం చేశారు. అనంతరం వివిధ వ్యాధులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, జయమ్మ, లక్ష్మిరేఖ తదితరులు ఉన్నారు.

రీ సర్వే నిర్వహించాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని సుబ్బారావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి రీ సర్వే నిర్వహించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించలేదని, గతంలో పక్కా ఇళ్లు ఉన్న వారికి మంజూరు చేశారని ఆరోపించారు. రీ సర్వే నిర్వహించి అసలైన లబ్ధిదారులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కె.రమాదేవి, ఎస్.రాణి, కె.అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

రహదారిపై కూలిన చెట్టు.. తొలగించిన పోలీసులు



ప్రధాన రహదారిపై కూలిన చెట్టు..

అశ్వాపురం: ఈదురుగాలికి మండల పరిధిలోని మొండికుంట గ్రామ శివారులో పెద్ద కాలువ మూలమలుపు వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి అర్ధరాత్రి పెద్ద చెట్టు కూలింది. దీంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. వర్షం కురుస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. సమాచారం అందుకున్న సీఐ అశోక్‌రెడ్డి హుటాహుటిన పోలీస్ సిబ్బందితో రహదారిపై చెట్టును తొలగింపజేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అన్నపురెడ్డిపల్లి: దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మధు



బూర్గంపాడు: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

బూర్గంపాడు: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు అన్నారు. సారపాక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. భూసమస్యలను రైతులు దరఖాస్తులో స్పష్టంగా నింపి, ఆధారాల ప్రతులను జత చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తహసీల్దార్ శిరీష, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ మధు అన్నారు. మండలంలోని ఊటుపల్లి, నర్సాపురం పంచాయతీల్లో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూభారతితో రైతుల సమస్యలన్నీ పరిష్కారమౌతాయని చెప్పారు. సదస్సుల అనంతరం న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఆర్ఐ మధు పాల్గొన్నారు.

భద్రాచలం నుంచి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

భద్రాచలంఅర్బన్: పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రత్యేక టూర్ ప్యాకేజీని ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చిందని సంస్థ భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి తెలిపారు. భద్రాచలం బస్టాండ్ నుంచి ఆయా ప్రదేశాలకు ప్రత్యేక బస్సులను వేశామని పేర్కొన్నారు. ఈ నెల 27న ఈ బస్సు సర్వీసులను ప్రారంభిస్తారని తెలిపారు. సామూహికంగా ఒకేసారి 30 నుంచి 35 మంది కోసం బస్ బుక్ చేస్తే ఒకరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే అందరికీ కలిపి పది శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేస కోవాలని డీఎం కోరారు. ఇతర వివరాలకు భద్రాచలం డిపో కార్యాలయంలోగాని, 855867140, 9063414561, 9959225987 నంబర్లలో గాని సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్యాకేజీల వివరాలు..

భద్రాచలం నుంచి పుణ్య క్షేత్రాలైన యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయం, వరంగల్ వేయి స్తంభాల గుడి, భద్రకాళి టెంపుల్, రామప్పకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. ఈ బస్సు ఈ నెల 27 నుంచి రాత్రి 9 గంటలకు భద్రాచలం నుంచి బయలుదేరి తిరిగి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. టికెట్ ధర ఒక్కొక్కరికి పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.900 ఉంటుంది. భద్రాచలం నుంచి అన్నవరం, ద్రాక్షారామం, వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయ స్వామి టెంపుల్ పుణ్యక్షేత్రాలకు భద్రాచలం నుంచి రాత్రి 9 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నారు. కాగా పెద్దలకు రూ.1500లు, పిల్లలకు రూ.900లు చార్జి చెల్లించాల్సి ఉంటుంది.

ధర్మ రక్షణలో భాగస్వాములవ్వాలి

చర్ల: హిందూ ధర్మ రక్షణ పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ విశ్వ హిందూ పరిషత్‌లో చేరి హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆ సంఘం రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చిన్న ఇంద్రకీలాద్రి ఆలయంలో ప్రఖండ కార్యదర్శి కిశోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్లలో ప్రతి నెలా విశ్వ హిందూ పరిషత్ సమావేశం జరిగేలా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో అఖండ జిల్లా కార్యదర్శి గంగాదరి సీత, ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మామిడి శ్యాంకుమార్, శివరాజు కృష్ణ కిశోర్, ఉపాధ్యక్షులుగా ఇడసవడ్ల రాము, మీసాల శ్రీను, సహాయ కార్యదర్శులుగా అలవాల మురళి, చెరుకూరి శ్రీకర్‌లను ఎంపిక చేశారు.

వసతిగృహాల్లో దోమలమందు పిచికారీ



గిరిజన బాలికల వసతి గృహం పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

చర్ల: మండలంలోని పలు వసతి గృహాల్లో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దోమలమందు పిచికారీ పనులను చేపట్టారు. మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలలో దోమలమందు పిచికారీ పనులు చేపట్టడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వసతిగృహాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మారావు, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాగుపల్లి బడిబాటలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని, వారి ఉన్నతి, యోగ క్షేమాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి పాత మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనాటి పూర్వపు ఉపాధ్యాయులు హాజరుకాగా వారిని మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి, వారి ఆశీస్సులను తీసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఆటపాటలు, పలు వినోద కార్యక్రమాలతో సంతోషంగా గడిపారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు (పూర్వపు ఉపాధ్యాయురాలు) బజ్జూరి సరళ, పూర్వపు ఉపాధ్యాయులు రంగారెడ్డి, మోహన్ రెడ్డి, అజయ్‌కుమార్, శ్రీదేవి, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ధర్నా.. వినతి



అశ్వారావుపేటరూరల్: కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పలు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. మొదట ప్రదర్శనగా బయలుదేరి తహసీల్ చేరకున్నారు. అక్కడ నిరసనలు వ్యక్తం చేసి.. తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మొదట స్థానికంగా సీతారామ నీరు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చర్ల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు